BHARATH SAMACHAR DIGITAL

4, జూన్ 2026, గురువారం భారత్ సమాచార్

అట్రాసిటీ కేసు దర్యాప్తును పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ



భారత్ సమాచార్.నెట్, మెదక్ జిల్లా: నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్-కె గ్రామానికి చెందిన జనగామ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీ/ఎస్టీ (SC/ST) అట్రాసిటీ కేసు దర్యాప్తు పురోగతిని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేసు విచారణలో భాగంగా బుధవారం ఆయన వెంకటాపూర్-కె గ్రామంలోని సంఘటనా స్థలాన్ని స్వయంగా సందర్శించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, స్థానిక సాక్షులను విచారించి వివరాలు సేకరించారు.

గ్రామ పర్యటన అనంతరం నిజాంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ నరేందర్ గౌడ్.. కేసుకు సంబంధించిన రికార్డులను, డైరీలను నిశితంగా పరిశీలించారు. అనంతరం దర్యాప్తు పురోగతిపై స్టేషన్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు త్వరితగతిన పూర్తి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలను మరింత వేగవంతం చేయాలని, కేసు విచారణను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పోలీసు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్న డీఎస్పీ.. ఇలాంటి సున్నితమైన కేసుల దర్యాప్తులో అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చట్టపరమైన నిబంధనలను ఎలా అనుసరించాలనే అంశాలపై సిబ్బందికి తగిన మార్గనిర్దేశం చేశారు. చట్టం ముందు అందరూ సమానులేనని, బాధితులకు భరోసా కల్పించేలా విచారణ సాగాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ సైదా, నిజాంపేట ఎస్ఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar